అక్కడ వరద... ఇక్కడ బురద!

2020లో కొట్టుకుపోయిన పోలవరం డయాఫ్రం వాల్

- రెండేండ్లకే గోదావరిపాలైన సీడబ్ల్యూసీ డిజైన్ చేసిన నిర్మాణం
- ఐదేండ్లయినా డిజైన్, నిర్మాణ లోపాలపై నివేదిక ఇవ్వని కేంద్రం
- లోపాలపై రాజ్యసభలో అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటవేత
- భారీ వరద ప్రవాహంతోనే వాల్ కొట్టుకుపోయిందని సర్దుబాటు
- రూ.వెయ్యి కోట్లతో కొత్త డీ-వాల్ నిర్మాణం చేపట్టిన బాబు సర్కారు
- కాళేశ్వరం మేడిగడ్డలో ఒక్క పిల్లర్ కుంగిపోతే గంటల్లోనే నివేదిక
- ఏడాదిన్నరలో మూడు నివేదికలు ఇచ్చిన కేంద్ర సంస్థ ఎన్‌డీఎస్‌ఏ
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల టైమ్‌లోనే నివేదికలు బయటకు
- మరమ్మతులు చేయకుండా రాష్ట్ర సర్కారు రాజకీయం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 8 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాలు... ఒకే నది... అదీ గోదావరి! రెండూ సాగునీటి ప్రాజెక్టులే... కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిది మాత్రం రెండు నాల్కల వైఖరి. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన డయాఫ్రంవాల్ ఏకంగా నదిలోనే కొట్టుకుపోతే ఉలుకుండదు... పలుకుండదు. ఐదేండ్లలో విచారణలు, నివేదికలు అసలే ఉండవు. అయ్యో... భారీ వరదకు కొట్టుకుపోయిందంటూ దాని స్థానంలో కొత్త నిర్మాణానికి నిధులు సైతం మంజూరు చేస్తుంది. కానీ తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన వందల నిర్మాణాల్లోని ఒక బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగిపోతే రాజకీయ బురదతో రాద్ధాంతం చేస్తున్నది. కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్టు.. అసెంబ్లీ ఎన్నికల ముందొకటి! పార్లమెంటు ఎన్నికల ముందు మరొకటి!! బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల ముందు ఇంకోటి!! ఇలా ఏడాదిన్నరలో మూడు నివేదికలు ఇచ్చి చిలువలు పలువలు చేస్తున్నది. డిజైన్, నిర్మాణ లోపాలంటూ తన ఆధీనంలోని సంస్థతో ప్రాజెక్టునే ఎండబెట్టేలా పావులు కదుపుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీలు మారినా సాగునీటి ప్రాజెక్టుల పనులు, ఫలాలు రైతులకు అందుతున్నాయి. అంతేకాదు, పరస్పర ఆరోపణలు చేసుకున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం కొట్టుకుపోయిన డయాఫ్రం వాల్ స్థానంలో రూ.వెయ్యి కోట్లతో కొత్తదానిని నిర్మిస్తున్నది. కానీ, తెలంగాణలో అలా కాదు... నిత్యం రావణకాష్ఠంలా పిల్లర్ కుంగబాటు అనేది ఓ రాజకీయాస్త్రంగా మారింది. పరస్పర నిరంతర ఆరోపణలకు పరిమితమైన రేవంత్ సర్కారు బరాజ్ పునరుద్ధరణ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయడంలేదు. పైగా రెండేండ్లపాటు సాగునీటికి రైతులు గోసపడుతున్నా లక్షలాది ఎకరాల్లో పంటలను ఎండబెడుతున్నదే తప్ప ప్రత్యామ్నాయ మార్గాలను చూడటం లేదు. అన్నం ఉడికిందో లేదో తెలుసుకునేందుకు ఒక్క మెతుకు పట్టుకుంటే చాలనేది ఎంత సత్యమో... తెలుగు రాష్ట్రాల్లో గోదావరి నదిపై రెండు సాగునీటి ప్రాజెక్టుల్లోని ఘటనలపై కేంద్రంలోని బీజేపీ తీరు, రైతుల శ్రేయస్సు పట్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విజన్ ఎలా ఉన్నాయనేందుకు పోలవరం-కాళేశ్వరం ప్రాజెక్టులే ఉదాహరణ.

కాళేశ్వరం వ్యథ

దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోక పడావు పడిన భూములు... వలసపక్షులైన ప్రజలు... అసలే కొత్త రాష్ట్రం! ఒక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలంటే కనీసం రెండు తరాలైనా ఎదురుచూడాలనేది అనుభవం. ఇలాంటి తరుణంలో జల సంకల్ప దీక్ష తీసుకొని అహోరాత్రులు శ్రమించి... కేసీఆర్ ప్రభుత్వం ఒక యజ్ఞంలా దేశ సాగునీటి చరిత్రలోనే రికార్డుస్థాయిలో మూడేండ్లలో నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులైనా, మంత్రులైనా... తెలంగాణలో రికార్డుస్థాయి పంటలు పండాయని కలలో ఊహించేందుకు సైతం సాహసించని స్థితి. అలాంటిది నిన్నటి కేసీఆర్ ప్రభుత్వమే కాదు ఇప్పటి కాంగ్రెస్ సర్కారులోని సీఎం, మంత్రులు కూడా తెలంగాణ రికార్డుస్థాయి పంటలు పండిస్తున్నదని అధికారికంగా ప్రకటించే పరిస్థితి వచ్చింది. అందుకు కారణం... కాళేశ్వరం. మరి ఇలాంటి ప్రాజెక్టుపై ఏడాదిన్నరగా ఏం జరుగుతున్నది?!

- ప్రాజెక్టులో ఒక భాగమైన మేడిగడ్డ బరాజ్ 2019లో అందుబాటులోకి వచ్చింది. ఈ బరాజ్ 2020లో రికార్డుస్థాయి వరదలు (డిజైన్ అంచనా కంటే 50 వేల క్యూసెక్కులు అదనంగా) వచ్చినా తట్టుకున్నది. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టులోని డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది.
- మేడిగడ్డ బరాజ్ కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక భాగమైతే... ఆ బరాజ్‌లో 8 బ్లాకులుగా 85 గేట్లు ఉన్నాయి. ఇందులో ఏడో బ్లాకులోని 20వ నంబర్ పిల్లర్ 2023 అక్టోబర్‌లో అంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుంగింది. నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ తామే స్వయంగా మరమ్మతులు చేసి బరాజ్‌ను పునరుద్ధరిస్తామని అధికారికంగా ప్రకటించింది. కానీ, మరుసటి రోజే ఢిల్లీలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులు హైదరాబాద్‌లో వాలిపోయారు. వెంటనే మేడిగడ్డ వద్దకు వెళ్లి పరిశీలించారు. కనీసం బరాజ్ కుంగిన ప్రాంతం వద్ద నదిలోకి దిగకుండానే ఢిల్లీకి వెళ్లిపోయారు. గంటల వ్యవధిలోనే ప్రాథమిక నివేదిక విడుదల చేశారు.
- ఏమీ పరిశీలించకుండానే బరాజ్ డిజైన్, నిర్మాణ లోపాలంటూ నివేదిక ఇవ్వడం... దానిని కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో చిలువలు పలువలు చేయడం జరిగిపోయింది. ఆతర్వాత దాదాపు నాలుగు నెలలపాటు గప్‌చుప్.
- పార్లమెంటు ఎన్నికల సమయం రాగానే ఎన్‌డీఎస్‌ఏ మళ్లీ హడావుడి చేసింది. మరో నివేదిక ఇచ్చింది. అందులో కొత్తగా తేల్చిందేమీ లేదు... అదే డిజైన్, నిర్మాణ లోపాలంటూ హడావుడి చేయడంతోపాటు ఇంకా కొన్ని డాక్యుమెంట్లు రావాల్సి ఉన్నందున తుది నివేదిక తర్వాత ఇస్తామని తెలిపారు.
- ఈలోగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈఎన్‌సీ నేతృత్వంలో ఒక కమిటీని, జస్టిస్ ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను, మరో విజిలెన్స్ కమిటీని వేసింది. నోటీసులు... విచారణలు... ఇంజినీర్ల సస్పెన్షన్‌కు సిఫారసులు... రాజకీయ డ్రామాలు... ఏడాదిన్నరగా ఇదే వరస. కానీ, బరాజ్ పునరుద్ధరణ మాత్రం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చిన తర్వాతనే అంటూ ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి ప్రకటనలు చేశారు.
- చాన్నాళ్లు పత్తాలేని ఎన్‌డీఎస్‌ఏ చివరకు... బీఆర్ఎస్ రజతోత్సవ సభ మరో మూడు రోజుల్లో జరుగుతుందనగా రాష్ట్రంలోని రాజకీయ జోష్‌ను పక్కదారి పట్టించేందుకు ఎట్టకేలకు తుది నివేదిక ఇచ్చింది. ఇందులో ఏమైనా కొత్తదనం ఉన్నదా అంటే... అదే డిజైన్, నిర్మాణ లోపం. పైగా రాష్ట్ర ఇంజినీర్లు తమ అనుమతి లేకుండా గ్రౌటింగ్ చేసినందున అక్కడ సాక్ష్యాధారాలు చెల్లాచెదురయ్యాయి... అందుకే తాము పరీక్షలు చేయలేకపోయామని చెప్పారు. కానీ, అసలు పునరుద్ధరణకు ఏం చర్యలు తీసుకోవాలో మాత్రం చెప్పడం మరిచారు.
- ఎన్‌డీఎస్‌ఏ నివేదికను కూలంకుశంగా పరిశీలించిన నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ... ఈ డొల్ల నివేదికలో ఏమున్నది? అసలు పరీక్షలు చేయకుండా ఎన్‌డీఎస్‌ఏ డిజైన్, నాణ్యత లోపాలని ఎలా చెప్తుంది? ఆ సంస్థ చెప్పలేదుగానీ అసలు ఏం చేయాలి? ఎక్కడ, ఎంత పరిమాణంలో చేయాలో మీరైనా చెప్పండి అంటూ ప్రభుత్వానికి దిమ్మతిరిగే రీతిలో లేఖ రాసింది.
- ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో ఏదో ఒరుగుతుందనుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పాలుపోలేదు. పైగా ఎన్‌డీఎస్‌ఏ నివేదిక డొల్లది అని ఎల్‌అండ్‌టీ ఆరోపించింది. దీంతో దిక్కుతోచని స్థితిలో బరాజ్ పునరుద్ధరణకు సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ పాండ్యా నేతృత్వంలో మరో కమిటీని వేసింది. నిన్నటి దాకా ఎన్‌డీఎస్‌ఏ నివేదిక తర్వాత పునరుద్ధరణ అన్న ప్రభుత్వం.. ఇప్పుడు పాండ్యా నివేదిక వైపు చూస్తున్నది. ఈలోగా రెండేండ్లపాటు యాసంగిలో సాగునీరు లేక లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి.

అసలు ఎన్‌డీఎస్‌ఏకు ఉన్న ప్రామాణికత ఏమిటి?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిన్నటిదాకా తమను గట్టెక్కిస్తుందనుకున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఒక రాజకీయాస్త్రంగా పనికొచ్చిన ఎన్‌డీఎస్‌ఏకి ఉన్న ప్రామాణికత ఏమిటని సాగునీటి రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 2021లో ఏర్పాటైన ఈ సాంకేతిక నిపుణుల సంస్థలో డ్యామ్ నిర్మాణాల్లో భద్రతకు సంబంధించిన సర్వే ఇన్వెస్టిగేషన్, డిజైన్, జియాలజిస్ట్, హైడ్రాలజీ, హైడ్రో మెకానికల్ ఇంజినీర్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్, డ్యామ్ బ్రేక్ అనాలసిస్, ఎమర్జెన్సీ యాక్షన్‌ప్లాన్ ఇంజినీరింగ్, డ్యామ్ కన్‌స్ట్రక్షన్, రిహాబిలిటేషన్ తదితర విభాగాల్లో సేవలందించే నిపుణులు ఉండాలి. ఈ మేరకు ఏర్పాటు సమయంలో 85 పోస్టులు మంజూరు చేశారు. కానీ, ఇప్పటివరకు అందులో ఉన్నది కేవలం 25 మంది మాత్రమే. అంటే పూర్తిస్థాయిలో నిపుణులు లేరనేది వాస్తవం. దీని ఏర్పాటుకు ముందుగానీ ఆ తర్వాతగానీ పదుల సంఖ్యలో ప్రాజెక్టుల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కానీ, ఎన్‌డీఎస్‌ఏ మాత్రం తమ దృష్టికి వచ్చింది కేవలం ఐదు మాత్రమేనని చెప్తున్నది. అందులో ఒకటి కాళేశ్వరం. మిగిలిన వాటిల్లో ముల్ల పెరియార్, తీస్తా, లోయర్ సుబంసిరి, సర్దార్ సరోవర్, తుంగభద్ర వంటి వాటిల్లో సమస్యలు తలెత్తితే రెండింట్లో మాత్రమే నిపుణుల కమిటీ వేసి చేతులు దులుపుకున్నది. మిగిలిన రెండింటి పరిస్థితి ఏమిటో ఎవరికీ తెల్వదు. అసలు పోలవరం డయాఫ్రం వాల్ వైపు ఎన్‌డీఎస్‌ఏ తొంగి చూసిన దాఖలాలు లేవు.

బీజేపీ సవతితల్లి ప్రేమ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయింది మొదలు గడచిన 11ఏండ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు రాష్ట్రంపై సవతితల్లి ప్రేమను చాటుతూనే ఉంది. అడుగడుగునా ఏపీకి వత్తాసు పలుకుతూనే ఉంది. తెలంగాణ జలహక్కులను కాలరాస్తూనే ఉన్నది. అందుకు సాగునీటి ప్రాజెక్టులే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి. రాష్ట్ర ఏర్పాటు చేయగానే ఏపీ పునర్విభజన చట్టం సాకుతో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను కల్పించింది. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న తెలంగాణలోని 7మండలాలను రాత్రికి రాత్రే ఏపీలో కలిపిసేంది. వేలాది కోట్ల నిధులను ధారపోస్తున్నది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డ్యామ్ రక్షణ, భద్రతలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ 2019లో కొట్టుకుపోయింది. దానిపై విచారణకు ఆదేశించలేదు. దాదాపు రూ.700కోట్లు నష్టం వాటిల్లగా, ఇప్పుడు అదనంగా రూ.1000కోట్లతో డీవాల్ నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. డీవాల్ దెబ్బతినడం వల్ల ప్రాజెక్టు పనులు నిలిచిపోవడంతో అంచనా వ్యయం దాదాపు రూ.15వేల కోట్లకుపైగా పెరిగింది. కేంద్రమే అనేకసార్లు పోలవరం ప్రాజెక్టు ఏపీ సర్కారుకు ఏటీఎంలా మారిందని బాహాటంగానే ఆరోపణలు చేసింది. అయినప్పటికీ ఇప్పటికీ ఈ ప్రాజెక్టుపై కేంద్రం ఎలాంటి విచారణ చేపట్టలేదు. డీవాల్ ఘటనపై ఎన్‌డీఎస్‌ఏ విచారణ జరపలేదు. ఎలాంటి ట్రిబ్యునల్ కేటాయింపులు, అనుమతులు లేకున్నా, ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం గోదావరి-బనకచర్ల లింక్‌ప్రాజెక్టును రూ.80వేల కోట్లతో చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ ప్రాజెక్టుకు నిధులను సమకూర్చేందుకు సైతం ప్రస్తుతం కేంద్రం సిద్ధమైంది. ఏపీకి ఇటీవల హామీ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టుల విస్తరణను చేపట్టినా, తెలంగాణ ఫిర్యాదులు చేసినా ఇప్పటికీ కేంద్రం పూర్తిగా ఏపీకి వత్తాసు పలుకుతూ నోరుమెదపడం లేదు.



గోదావరి నదిపై ఏపీ సర్కారు నిర్మించిన పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడంతో కనిపిస్తున్న శిథిలాలు

పోలవరం కథ

> పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వడంతో డిజైన్ మొదలు నిధుల వినియోగం వరకు ప్రతి అంశంలోనూ కేంద్ర జలశక్తి శాఖ ఆధీనంలోని సంస్థల పర్యవేక్షణ ఉంటుంది. అంటే చిన్న తప్పిదమైనా ఇట్టే రట్టవుతుందని అనుకుంటాం. కానీ, పోలవరం ప్రాజెక్టు మాత్రం ఇందుకు భిన్నం. 2014-19 సమయంలో పోలవరం ప్రాజెక్టు అక్కడి అధికార పార్టీ టీడీపీకి ఏటీఎంలా మారిందనే ఆరోపణలు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇన్నేండ్లలో ఒక్కసారైనా డిజైన్-నిర్మాణ లోపాలపై కఠినంగా వ్యవహరించిన సందర్భాలు లేవు.

- పోలవరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై దాదాపు 1.47 కిలోమీటర్ల పొడువున మట్టి, రాతి కట్టను (ఈసీఆర్ఎఫ్) నిర్మించాల్సి ఉన్నది. ఈ డ్యాంకు రక్షణగా మీటరున్నర వెడల్పుతో 1.396 కిలోమీటర్ల పొడవున డయాఫ్రం వాల్ నిర్మించాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు కావడంతో వీటికి సంబంధించి డిజైన్ల రూపకల్పన కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోనే పూర్తయింది. ఈ మేరకు 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో డయాఫ్రం వాల్ నిర్మాణం మొదలుపెట్టారు. ఎగువన కాపర్ డ్యామ్‌ను నిర్మించకుండానే దాదాపు రూ.600 కోట్లతో నది అడుగు భాగంలోకి దాదాపు 90 మీటర్ల లోతుతో దీని నిర్మాణం చేపట్టారు. 2018 సంవత్సరం చివరినాటికే డీ-వాల్ నిర్మాణం పూర్తి చేశారు. వైఎస్ జగన్ హయాంలో 2020 సంవత్సరంలో అంటే నిర్మాణం పూర్తయిన రెండేండ్లకే వరదలు వచ్చినప్పుడు ఈ డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. మూడుచోట్ల భారీగా దెబ్బతిని 200 మీటర్ల పొడవున గోడ తునాతునకలై వరద నీటిలో కొట్టుకుపోయింది.
- ఘటన జరిగి ఐదేండ్లు కావస్తున్నది. ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కేంద్ర జలసంఘంగానీ 2021లో వచ్చిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ)గానీ ప్రత్యేకంగా విచారణ చేసి నివేదికలు ఇచ్చిన దాఖలాలు లేవు.
- ఘటన జరిగిన సమయంలో ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వమైనా, 2024లో వచ్చిన చంద్రబాబు సర్కారైనా ఆరోపణలే తప్ప ఎక్కడా పనులను ఆపలేదు. ఎగువన కాపర్ డ్యాం నిర్మాణం చేయకపోవడం వల్లనే ఇది జరిగిందని విమర్శలు చేసుకుంటారే తప్ప రంధ్రాన్వేషణ కోసం కమిషన్లు, విచారణ కమిటీలు వేసి ఒక్క ఇంజినీర్ పైనా చర్యలు తీసుకోలేదు.
- రాజ్యసభలో 2024 ఫిబ్రవరి 5న టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ పోలవరం ప్రాజెక్టులోని డీ-వాల్ కొట్టుకుపోవడం వెనక నిర్మాణ నాణ్యత లోపాలపై అనుమానాలున్నాయనే వాస్తవాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చాయా? అని లిఖితపూర్వకంగా ప్రశ్న అడిగారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తన లిఖితపూర్వక సమాధానంలో ఎక్కడా ఈ అంశంపై నోరు విప్పలేదు. పోలవరం చరిత్రను క్లుప్తంగా చెప్పి భారీ వరదలు వచ్చినందున డీ-వాల్ కొట్టుకుపోయిందని జవాబిచ్చారు.
- ఈ ఐదేండ్లలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా, కెనడా తదితర అంతర్జాతీయ నిపుణులను తీసుకువచ్చి అధ్యయనం చేయించాయి. చివరకు దాని స్థానంలో కొత్తది నిర్మించాలని నిర్ణయించడం... అందుకు కేంద్ర జల సంఘం మళ్లీ ఆమోదం తెలపడం జరిగిపోయాయి. చివరకు తాజాగా చంద్రబాబు ప్రభుత్వం రూ.1000 కోట్లతో కొత్త నిర్మాణాన్ని కూడా మొదలుపెట్టింది.
- మరి రూ.1000 కోట్ల భారం! కానీ బాధ్యులెవరు? ఎందుకు జరిగింది? తప్పు చంద్రబాబుదా? జగన్‌దా? ఇంజినీర్లదా? అవి నీతి కారణమా? ఇలాంటి రంధ్రాన్వేషణ లేవీ లేవు. కేంద్రం మౌనం... రాష్ట్ర ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతున్నది.

తెలంగాణకు తీరని ద్రోహం..

> మరోవైపు తెలంగాణ రాష్ట్రంపై మాత్రం బీజేపీ అడుగడుగునా వివక్ష చూపుతున్నది. రాష్ట్రానికి సంబంధించి కీలకమైన కరువు పీడిత ప్రాంతాలకు తాగు, సాగునీటిని అందించే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టులకు ఎలాంటి జాతీయహోదానూ ఇవ్వలేదు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఇప్పటికీ దాదాపు 52వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి.

ఆ ప్రాంతాల్లో సర్వే నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టాలని ఏళ్లుగా విన్నవించినా దిక్కులేకుండా పోయింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు డీపీఆర్‌కు అనుమతులను మంజూరు చేయడం కాదుకదా. ఏకంగా ఆ డీపీఆర్‌నే తిప్పిపంపింది. ఇక మేడిగడ్డ బరాజ్ ఘటన జరిగిన వెనువెంటనే ఎన్డీఎస్ఏను రంగంలోకి దించింది. విచారణ పేరిట హంగామా చేసింది. ఎలాంటి సాంకేతిక పరీక్షలను నిర్వహించకుండానే ప్రాజెక్టు లోపాలమయమంటూ రాద్ధాంతం చేసింది. ఏపీ అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టుల విస్తరణపై ఫిర్యాదు చేస్తూ తెలంగాణ వందలలేఖలు రాసింది. కానీ ఇప్పటికీ ఒక్క దానిపైనా స్పందించి, ఏపీని నిలువరించకపోవడం గమనార్హం.

నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు నేడు (సోమవారం) హాజరుకానున్నారు. కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ హరీశ్‌రావును విచారించనున్నారు. ఇప్పటికే అన్ని దశల్లో విచారణ పూర్తిచేసిన కమిషన్.. ప్రస్తుతం రాజకీయ ప్రముఖులను విచారిస్తున్నది. ఇప్పటికే ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను ప్రశ్నించగా నేడు హరీశ్‌రావును విచారించనుంది.

క్యాబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరంపై నిర్ణయాలు

- ఏ నిర్ణయాన్ని కూడా కేసీఆర్ సొంతంగా అమలు చేయలేదు
- మంత్రివర్గం ఆమోదం లేకుండా ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమేనా?
- తుమ్మల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఈటల రాజేందర్

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ అధినేత, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ నిర్ణయాన్ని కూడా సొంతంగా అమలు చేయలేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. శనివారం ఓ తెలుగు న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ క్యాబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టు క్యాబినెట్ ఆమోదం లేకుండా సాధ్యమా? అని ప్రశ్నించారు. క్యాబినెట్ అనుమతి లేకుండా ఏ జీవోలు కూడా విడుదలకావని చెప్పారు. ఆనాటి విషయాలను తుమ్మల నాగేశ్వరరావు మర్చిపోయారేమోనని, అవసరమనుకుంటే డాక్యుమెంట్స్ పంపుతానని ఈటల చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం లేదని చెప్పడం కరెక్ట్ కాదని మండిపడ్డారు. కాళేశ్వరంపై మంత్రివర్గ ఉపసంఘం వేసింది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. దమ్ముంటే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును ప్రభుత్వం బయటపెట్టాలని సవాల్ చేశారు.

మరో కౌలు రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక అన్నదాత మనస్తాపం
- వరంగల్ జిల్లా రెడ్డిపాలెంలో కర్షకుడు బలవన్మరణం

సత్య(ఫైల్)

గీసుగొండ, జూన్ 8: పంట దిగుబడులు లేక.. చేసిన అప్పులు తీర్చలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నది. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం గీసుగొండ మండలం రెడ్డిపాలెంకు చెందిన వరగాని సత్య(40) 2.13 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని రెండేండ్లుగా పత్తి సాగు చేస్తున్నాడు. దిగుబడి సరిగా రాకపోగా అనారోగ్యానికి గురైన భార్య వైద్యం కోసం, పిల్లల చదువుల కోసం రూ. 6 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వాళ్లు ఒత్తిడి చేస్తుండటంతో తట్టుకోలేక ఈనెల 1న సత్య మొగిలిచెర్ల శివారులోని కెనాల్ కట్ట వద్ద గడ్డిమందు తాగి కొడుకు యశ్వంత్‌కు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి చేరుకున్న కుమారుడు.. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని ఎంజీఎం దవాఖానకు తరలించాడు. అతడు చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రైతు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఖాళీ చేయండి.. లేకపోతే లారీచార్జే!

- కోర్టు ఆర్డర్లతో ఏంకాదు, నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావు
- సున్నంచెరువు వద్ద బాధితులకు హైడ్రా అధికారుల బెదిరింపులు
- ఇండ్ల స్థలాల నుంచి ఖాళీ చేయాలని స్థానికులపై ఒత్తిళ్లు
- ప్రత్యామ్నాయం చూపితేనే ఖాళీ చేస్తామని తేల్చిచెప్పిన బాధితులు

సున్నంచెరువు వద్ద హైడ్రా వాహనం దిగకుండానే స్థానికులతో మాట్లాడుతున్న అధికారి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): "మీకెన్నిసార్లు చెప్పాలి? స్థలాలు ఖాళీ చేయాలని చెప్తే తమాషాలు చేస్తున్నారా? ఒకట్రెండురోజుల్లో మొత్తం ఖాళీ చేయాలి. లేకపోతే లాఠీచార్జి చేస్తేనా వెళ్లగొడ్తం. చెరువు దగ్గర జాగా ఎందుకు కొన్నరు? కోర్టు ఆర్డర్లు ఉంటే నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావు. ఎక్కడైనా చెప్పుకోండి. మీరు ఖాళీ చేసి పోవాల్సిందే. ఇక్కడనే ఉంటామంటే బొక్కలో వేసి, బొక్కలు ఇరగ్గొడ్తం" ఇదీ సున్నంచెరువు వద్ద స్థానికులపై హైడ్రా అధికారులు చేసిన వ్యాఖ్యలు. దీంతో దిక్కుతోచని స్థితిలో స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పది నెలలుగా ఇదే ఒత్తిడి!

మాదాపూర్ సున్నంచెరువు సమీపంలోని నిర్మాణాలను నిరుడు సెప్టెంబర్ 8న హైడ్రా అధికారులు కూల్చివేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లో సామాగ్రి బయటకు తీసుకోనివ్వకుండా, వర్షం పడుతున్నా అందరినీ కట్టుబట్టలతో ఇండ్లలో నుంచి బయటకు పంపి, కట్టడాలు కూల్చివేశారు. తామెక్కడకి వెళ్లాలో తెలియక, కూల్చివేతల శిథిలాల మధ్యే బాధితులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. పదినెలలుగా హైడ్రా, సున్నంచెరువు బాధితుల మధ్య వివాదం కొనసాగుతున్నది. కూల్చివేతల తర్వాత తమకు కరెంట్ కట్ చేశారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కరెంట్ ఆఫీసుల చుట్టూ తిరిగి, అధికారుల నుంచి కరెంట్ ఇస్తామనే హామీ తీసుకోగానే హైడ్రా అధికారులు వచ్చి అడ్డుకుంటున్నట్టు చెప్పారు. చందానగర్ సర్కిల్‌లో ఉంటున్న తమకు ఇండ్లనంబర్లు కూడా ఉన్నాయని, ఇప్పుడు హైడ్రా అధికారులు, సిబ్బంది వచ్చి తమను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో సున్నంచెరువును సర్వేచేసి హద్దులు నిర్ణయించేవరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, పిటిషనర్ల ఇండ్లను కూల్చవద్దని, న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఈ మేరకు పలుశాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను హైడ్రా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడురోజుల క్రితం హైడ్రా ఇన్‌స్పెక్టర్ వచ్చి ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ ఒత్తిడి చేశాడని తెలిపారు.

వదిలి వెళ్లే ప్రసక్తేలేదు

ఈనెల 4న హైడ్రా కమిషనర్ రంగనాథ్ సున్నంచెర